స్వామి వివేకానంద జయంతి 2





రౌడీ షీటర్ జిల్లా బహిష్కరణ 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

12-1-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## నిజాంసాగర్ నీటి విడుదల

**అక్షరటుడే, బాన్సువాడ:** నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు కోసం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను సోమవారం ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 8.30 గంటలకు అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ ఏఈఈ సాకేత్ తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.253 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వివరించారు. రైతులు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆయకట్టు రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలలో హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు. కాలువ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వామపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు అందించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ తదితరులున్నారు.

## పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చు



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** బాధితులు నిర్భయంగా పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సీపీ కార్యాలయంలో సోమవారం పోలీస్ ప్రజావాణి నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో 35 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సీపీ బాధితులతో మాట్లాడారు. బాధితుల నుంచి వారి సమస్యలు తెలుసుకుని చట్టపరంగా తీసుకునే చర్యల నిమిత్తం సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐ, ఎస్సైలకు సమాచారం అందించారు. సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా సీపీ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. మూడోవ్యక్తి ప్రమేయం లేకుండా తమ సమస్యకు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు.




# పిట్ లైన్ ఏర్పాటయ్యేనా..!

- నిజామాబాద్ రైల్వే జంక్షన్ ఏర్పడి తొమ్మిదేళ్లు
- రైల్వే మంత్రికి విన్నవించిన ఎంపీ అర్వింద్
- ఈ సారి బడ్జెట్‌లో మోక్షం లభించేనా..

**నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఆధునిక హంగులతో సిద్ధమవుతుంది. సుమారు తొమ్మిదేళ్ల క్రితం 2017లో జంక్షన్‌గా మారింది. స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 80 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక వైపు ముంబయి, మరోవైపు సికింద్రాబాద్, ఇంకోవైపు కరీంనగర్ రైళ్లు నడుస్తుంటాయి. జంక్షన్‌గా మారడంతో కాబట్టి పిట్ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని ఏర్పాటుతో రైళ్లను నేరుగా ఇక్కడి నుంచి ప్రారంభించే అవకాశం ఉంటుంది. అలాగే వాటి నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుంది.**
**- అక్షరటుడే, ఇందూరు**

ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి, కాజీపేటలో రెండు, నాందేడ్‌లో ఒక పిట్ లైన్ ఉన్నాయి. ఆదిలాబాద్‌లో పిట్‌లైన్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. 2021లో ఆదిబాద్‌కు మంజూరు కాగా.. పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇక్కడ 24 కోచ్‌ల రైళ్ల నిర్వహణ సామర్థ్యం ఉంది.

### రైల్వే మంత్రి దృష్టికి..

నిజామాబాద్‌లో కూడా ఆదిలాబాద్ మాదిరిగా పిట్‌లైన్ ఏర్పాటు చేస్తే రైళ్ల ప్రారంభం, ముగింపు అనేది జరుగుతుంది. ట్రెయిన్ మెయింటెనెన్స్‌కు అవకాశం కలుగుతుంది. ప్రధానంగా పిట్ లైన్ ఏర్పాటుతో నాందేడ్ వరకు నడిచే రైళ్లను నిజామాబాద్ వరకు పొడిగించే అవకాశం కలుగుతుంది. ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ప్రతినిధులు గతంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల ఎంపీ అర్వింద్ కూడా రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు.

### స్టేషన్ ఆధునికీకరణ..

ప్రస్తుతం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రూ.50 కోట్ల వ్యయంతో వెయిటింగ్ హాల్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, సువిశాలమైన పార్కింగ్ ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో పిట్‌లైన్ సైతం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. 2026-27 బడ్జెట్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పిట్ లైన్ ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తే బాగుంటుందని వ్యాపారులు, జిల్లా వాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలి: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి :** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సోమవారం నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, తీవ్రమైన కేసుల్లో ఎస్‌వోపీని కచ్చితంగా పాటిస్తూ వేగవంతమైన దర్యాప్తు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా మంగళవారం నుంచి ప్రారంభమయ్యే 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు.



## తుది ఓటరు జాబితా విడుదల

**అక్షరటుడే, ఇందూరు:** నగరపాలక సంస్థ తుది ఓటరు జాబితాను సోమవారం కమిషనర్ దిలీప్ కుమార్ విడుదల చేశారు. గతంలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయగా.. రాజకీయ పార్టీల నుంచి పలు అభ్యంతరాలు వచ్చాయి. అభ్యంతరాలను సవరించిన అనంతరం ఫొటోతో కూడిన తుది జాబితాను విడుదల చేసినట్లు కమిషనర్ తెలిపారు. నిజామాబాద్ నగరంలో మొత్తం 3,48,051 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో పురుషులు 1,67,461 మంది, మహిళలు 1,80,546 మంది ఉండగా.. ఇతరులు 44 మంది ఉన్నారు. అత్యధికంగా 11వ డివిజన్ లో 7,753 మంది, 19వ డివిజన్లో 7,708 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా 44వ డివిజన్లో 3,702 మంది, 45వ డివిజన్‌లో 4,650 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.

–వివరాలు 2వ పేజీలో..



## రెండున్నరేళ్లలో సీడీపీ నిధులు శూన్యం : ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఇందూరు:** రెండున్నరేళ్లలో సీడీపీ నిధులు శూన్యమని కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకు మాత్రమే పరిమితమైందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీనన్నారు. దేశంలో అసలైన సెక్యులర్ పార్టీ తమదేనని ఎమ్మెల్యే ధన్‌పాల్ స్పష్టం చేశారు. ఓడిన కాంగ్రెస్ అభ్యర్థికి రూ.10 కోట్లు కేటాయించారని ఇప్పటివరకు ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలపాలన్నారు. అర్బన్‌ను రూ.500 కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర పథకాలు కాపీ కొడుతున్నారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి జ్యోతి, నాయకులు రాజు, ప్రమోద్, ప్రభాకర్, వేణు, కిషోర్ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్: సీపీ సాయిచైతన్య




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** బంగారం దుకాణాలను కొల్లగొట్టి చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. బోధన్ పట్టణ పరిధిలో గతనెల 21న నలుగురు సభ్యులతో కూడిన అంతర్రాష్ట్ర ముఠా ఆచన్‌పల్లిలో ఓ బైక్ చోరీకి పాల్పడింది. అనంతరం వారు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న రెండు బంగారు దుకాణాల షెట్టర్లను తొలగించారు. మొత్తంగా 35 తులాల బంగారం, 14 కిలోల వెండి నగలు దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న బోధన్ పట్టణ పోలీసులు సీసీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఈనెల 11న ఆచన్‌పల్లి బైపాస్ రోడ్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తూ పోలీసుల కంటబడ్డారు. వారిని విచారించేలోపు పారిపోయేందుకు ప్రయత్నించడంతో వెంబడించి ఇద్దరు వ్యక్తులు, బైకును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా షట్టర్లు పగులగొట్టింది తామేనని ఒప్పుకున్నారు. వారివద్ద నుంచి 14 తులాల బంగారం నగలు, 6 కిలోల వెండి వస్తువులు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చురుకుగా వ్యవహరించిన బోధన్ సీఐ వెంకట నారాయణ, టౌన్ ఎస్సై మనోజ్ కుమార్, ఏఎస్సై బోధన్, బాబురావు, సిబ్బంది రవి, మహేష్, సాయి కుమార్, అశోక్‌ను సీపీ అభినందించారు.



## అభివృద్ధిని చూసి ఓటు వేయాలి: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** అభివృద్ధి ఎవరు చేస్తున్నారో చూసి ఓటు వేయాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ప్రజలను కోరారు. సరంపల్లి, పాత రాజంపేట, అడ్లూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పట్టణంలో తాము చేసిన అభివృద్ధిని చూపిస్తూనే ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. అభివృద్దే తమ అజెండా అని, మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుంటూ, నిత్యం అందుబాటులో ఉండే కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు.



## మున్సిపల్ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపల్ ఓటరు జాబితాలో తప్పులను సరిచేయకుండా.. దొంగ ఓట్లను ఏరివేయకుండా నిర్లక్ష్యం వహించిన అధికారుల తీరుపై బీజేపీ భగ్గుమంది. ఈ మేరకు సోమవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయాన్ని నాయకులు ముట్టడించారు. పట్టణంలోని మున్సిపాలిటీకి 12 గంటల సమయంలో చేరుకున్నారు. బీజేపీ నాయకులు మున్సిపల్ గేటును, పోలీసులను తోసుకుని కార్యాలయంలోనికి వెళ్లే ప్రయత్నం చేయగా కార్యాలయ ద్వారం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులను తోసుకుని వెళ్లి కార్యాలయ డోర్లను బద్దలుకొట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య భారీగా తోపులాట చోటుచేసుకుంది. బీజేపీ ముట్టడి సందర్భంగా ముందుగానే పోలీసులు మున్సిపాలిటీ వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. ఈ మేరకు కార్యాలయానికి తరలివచ్చిన నాయకులను బయటకు తీసుకెళ్లారు. తోపులాట మధ్య పలువురు పోలీసులు, బీజేపీ నాయకులు కింద పడిపోయారు. బీజేపీ నాయకులను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా శ్రమించాల్సి వచ్చింది. అనంతరం బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీసు వాహనాలు, డీసీఎం వ్యాన్లలో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితాను సవరించేదాక వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీజేపీ నాయకులు చెప్పారు.

## ఆర్మూర్ పట్టణాభివృద్ధికి రూ.65 కోట్లతో ప్రణాళిక



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. బీటీ రోడ్లు, సీసీ డ్రెయినేజీల నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి తెచ్చిన నిధులతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డిని పరోక్షంగా ఉద్దేశించి మాట్లాడుతూ.. నకిలీ డాక్టర్లు తనిఖీలు చేస్తే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని అధికారులను సూచించారు. నకిలీ డాక్టర్ల మాయలో పడి నాణ్యత లోపంతో పనులు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అనంతరం రైతు వేదికలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు ఆర్మూర్ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ శ్రావణి, అధికారులు ఉన్నారు.

## రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, నిజామాబాద్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంటామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో అధిక సంఖ్యలో స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని పీసీసీ చీఫ్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ పార్టీ తరపున పార్టీ కార్యకర్తలకు బీ ఫారం ఇచ్చే విషయంలో ఎలాంటి పక్షపాత ధోరణి ఉండదని ప్రజలు కోరుకునే వారికే టికెట్ ఇస్తామన్నారు. పార్టీలో కొనసాగుతూ కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ మంత్రిగా ఉన్న కేటీఆర్ రూ.10వేల కోట్ల పెట్టుబడులు కూడా తేలేదని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. రేవంత్ సీఎం అయ్యాక రూ. లక్షా 70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. రూ.5లక్షల కోట్లకు పైగా గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం చేసుకున్నామని ఆయన వివరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎక్కడా ఇవ్వడం లేదని కానీ తెలంగాణ లో ప్రతి రేషన్‌కార్డుదారుడికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. ఇల్లు లేని పేదవారు ఉండవద్దనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఎన్నడూ లేనంత అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో జరిగినందున మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం సీట్లు గెల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, సీనియర్ నాయకులు దాసరి నర్సింలు, నరాల రత్నాకర్, వినయ్ రెడ్డి, జావిద్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
AKSHARA TODAY


వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా


ఆర్మూర్ లో వివేకానందునికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి


నగరంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిలో భారీ ర్యాలీ..

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**ఉమ్మడిజిల్లాలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆయన ఆలోచనలు, ఆదర్శాలు భారతదేశ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జయంతిని యువజన దినోత్సవంగా జరుపుకుంటామని పేర్కొన్నారు. - అక్షరటుడే, నెట్‌వర్క్**


వేంపల్లి గ్రామంలో..


హిందూ వాహిని ఆధ్వర్యంలో..


బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


నగరంలోని కోటగల్లిలో..


బోధన్‌లో..


ఎల్లారెడ్డిలో..



నిజామాబాద్ నగరంలో తపస్ ఆధ్వర్యంలో..


ముప్కాల్ మండలంలో..


కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



ఆర్మూర్ బార్ అసోసియేషన్‌లో..


కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో..

## ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఉస్మానియా వైద్యుల బృందం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని ఉస్మానియా వైద్యుల బృందం సోమవారం సందర్శించింది. మూత్రకోశ వ్యాధుల నిపుణుల బృందం సభ్యులు సోమవారం ఉదయం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డయాలిసిస్ రోగులను పరిశీలించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 28 మంది డయాలిసిస్ రోగులు, రికార్డులను పరిశించింది. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నెఫ్రాలజిస్ట్ చిరంజీవి, విజేత, ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, ఎస్ఏపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి అబ్దుల్ రెహ్మాన్, శ్రీహరి, ఏజీఎస్ ఇన్‌ఛార్జి సందీప్, ఎల్లారెడ్డి సెంటర్ ఇన్‌ఛార్జి మధు, ఆస్పత్రి సిబ్బంది, ఆరోగ్యశ్రీ బృందం పాల్గొన్నారు.



## రౌడీ షీటర్ జిల్లా బహిష్కరణ..




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ జిల్లాలో కొన్నేళ్ల నుంచి నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ బర్సాత్ అమేర్‌కు పోలీసులు జిల్లా బహిష్కరణ విధించారు. సీపీ సాయిచైతన్య వెలువరించిన ఉత్తర్వులను పోలీసులు సోమవారం అతడికి అందజేశారు. నగరంలోని ఆటో నగర్‌కు చెందిన బర్సాత్ అమేర్ జిల్లాలో వివిధ నేరాలకు పాల్పడ్డాడు. ఇప్పటికే అతడిపై 22 కేసులు నమోదై ఉన్నాయి. అతను గత ఆరేళ్లుగా నేరాలకు పాల్పడుతూ జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని పోలీసు రికార్డుల్లో ఉంది. అంతేకాకుండా ఒకసారి పీడీ యాక్ట్‌ను కూడా ప్రయోగించారు. బర్సాత్ అమేర్ అనేకమార్లు జైలుకు వెళ్లినప్పటికీ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రావడం లేదని సీపీ పేర్కొన్నారు. ఇతని వల్ల జిల్లాలో శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందన్నారు. ఇందుకుగాను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ తనకున్న అధికారాల మేరకు సెక్షన్ 26(1)(a) హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్1348' ప్రయోగించారు. ఈ చట్టం ప్రకారం రానున్న ఎలక్షన్ దృష్ట్యా బర్సాత్ అమేర్‌ను ఏడాది పాటు నిజామాబాద్ జిల్లా నుంచి బహిష్కరణ చేశారు.

## ఆశాలకు యూనిఫాంల అందజేత



**అక్షరటుడే, కోటగిరి:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు యూనిఫాంలను అందజేశారు. స్థానిక సర్పంచ్ సంధ్య హన్మాండ్లు (బజరంగ్) చేతుల మీదగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గర్భవతుల నమోదు దగ్గర నుంచి చిన్నపిల్లలకు టీకాల వరకు గ్రామాల్లో ఆశా కార్యకర్తల సేవలు అభినందనీయమన్నారు. సర్వేలు, ఆన్‌లైన్ నమోదు తదితర కార్యక్రమాల్లో ఆశాకార్యకర్తలు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కరణ్, హెల్త్ సూపర్‌వైజర్లు సుజాత, సావిత్రి, సునీత, ఓమన్ పటేల్, గంధపు మోహన్, మన్సూర్, హన్మాండ్లు, లక్ష్మణ్, సంతు పటేల్, శంకర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**అక్షరటుడే, బాల్కొండ:** సైబర్ నేరాలపై మండల కేంద్రంలో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శైలేందర్ మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఖాతా వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. తెలియని యాప్‌ల జోలికి వెళ్లవద్దన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, లింకులు, డిజిటల్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## చైనామాంజా విక్రయిస్తే కఠినచర్యలు

**అక్షరటుడే, ఆర్మూర్:** చైనామాంజా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నందిపేట్ ఎస్సై శ్యాంరాజ్ హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రంలో పలు పతంగుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చైనామాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఎక్కడైనా చైనామాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన భామంకర్ విజయ్ లక్ష్మి, సంగ రాజేష్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారి పరిస్థితిని నాయకులు ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం భామంకర్ విజయ్ లక్ష్మికి రూ.30వేలు, సంగ రాజేష్‌కు రూ.45వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, అలూర్ మండల యూత్ అధ్యక్షుడు సిరికొండ మహేష్, యూత్ అధ్యక్షుడు కొండ శివ కృష్ణ, హబీబ్, గంగారాం, నర్సింగ్, ధర్మయ్య, వెంకటి, శ్రీనివాస్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

బోధన్‌లో..



బాన్సువాడలో..



ఆర్మూర్‌లో..



# ఓటరు తుది జాబితాల విడుదల

**ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడిజిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో తుది ఓటరు జాబితను ఆదివారం విడుదల చేశారు. ఆయా బల్దియాలలో మున్సిపల్ కమిషనర్లు జాబితాలను ప్రకటించారు. అనంతరం వారిని ప్రజల పరిశీలనార్థం తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఉంచారు. – అక్షరటుడే, నెట్‌వర్క్**



ఎల్లారెడ్డిలో..

## సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు క్రీడా సామగ్రి వితరణ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో సోమవారం గ్రామ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కమ్మర్‌పల్లి వాస్తవ్యుడు తపస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు, ఉప్లూలూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సల్లూరి కిషన్ గౌడ్ క్రీడాకారులకు రూ.10వేల విలువైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్‌లో ఎస్సైగా పనిచేస్తున్న తన కొడుకు శ్రీసాయి పుట్టినరోజును పురస్కరించుకొని క్రీడలను ప్రోత్సహించడానికి కమ్మర్‌పల్లిలో క్రీడాసామాగ్రి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిశాంత్, సాగర్, సాఫ్ట్‌బాల్ కోచ్ రాహుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.





## పీడిత ప్రజల గొంతుక అలిశెట్టి ప్రభాకర్

**అక్షరటుడే, ఇందూరు :** పీడిత ప్రజల గొంతుక అలిశెట్టి ప్రభాకర్ అని సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ప్రభాకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలిశెట్టి ప్రభాకర్ తన కవితలు, రచనల ద్వారా జనాల్లో చైతన్యం తెచ్చేందుకు విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన బైక్.. రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**అక్షరటుడే ఎల్లారెడ్డి :** రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నిజాంసాగర్ మండలం పిట్లం రోడ్డుపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. నిజాంసాగర్ పిట్లం మండలం మాగి గ్రామానికి చెందిన నగేష్ గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఆదివారం రాత్రి వేళ దర్గా సమీపంలో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో నగేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నగేష్ రాత్రికి ఇంటికి రాకపోవడంతో బంధువు వెతుకుతుండగా.. దర్గా సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డు పక్కన మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి ఏడురోజుల జైలు

**అక్షరటుడే నిజామాబాద్ క్రైం :** డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. నగరంలోని గాంధీ చౌక్ వద్ద ఈ నెల 8న డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా.. బ్యాంక్ కాలనీ ఆర్య నగర్‌కు చెందిన దినేష్ అధికంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుపడ్డాడు. అతడిని సోమవారం స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చారు. అతనికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అనంతరం ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మొదటిసారి తాగి బండి నడిపితే రూ.10,000 జరిమానా లేదా జైలుశిక్ష, రెండోసారి రూ.15000 జరిమానా, జైలు శిక్ష విధించబడతాయని ఆయన తెలిపారు.